

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | శుక్రవారం 04-09-2026 | సంపుటి - 31 | సంచిక - 102 | రూ : 4 | పేజీలు : 8

# బెదిరింపులతో భయపెట్టలేరు

## స్నేహంతో మాత్రమే నన్ను గెలవగలరు

- నాపై ఒత్తిడి లేదు.. సీఎంగా బాధ్యతతో పనిచేస్తున్నా
- అసద్, అక్బర్‌లు దేశభక్తిలో మోదీ, అమిత్‌షాకు తక్కువేం కాదు
- పాతబస్తీ అభివృద్ధికి ఎన్ని నిధులైనా కేటాయిస్తా
- సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్‌రెడ్డి






హైదరాబాద్: బెదిరింపులతో తననెవరూ భయపెట్టలేరని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నందున.. ఆ కుర్చీకి ఉన్న పరిమితులను అర్థం చేసుకుని.. బాధ్యతగా పనిచేస్తున్నానని తెలిపారు. తనపై ఎవరి ఒత్తిడి లేదని, తననెవరూ ఒత్తిడి చేయలేరన్నారు. స్నేహంతో మాత్రమే తనను గెలవగలరని, దోస్తీకి గులామునని గుర్తుచేశారు. చంచల్‌గూడ నుంచి ఐఎస్ సదన్ కూడలి అవతలి వరకు 3.3 కి.మీ పొడవునా నాలుగు లైన్ల వెడల్పుతో, రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చంచల్‌గూడ వద్ద ప్రారంభించారు. అనంతరం చంచల్‌గూడ డిగ్రీ కళాశాల మైదానంలో సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ... ''ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు పులిలా ఉండేవారు.. దిల్లీ నుంచి వచ్చి బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సంతోషంగా పాల్గొన్నారు. అనంతరం వేదికపై ముభావంగా కనిపిస్తున్నారు. వీహెచ్ అన్నా.. సీఎంను మీరేమైనా అన్నారా'' అని వ్యాఖ్యానించగా... దీనికి బదులుగా సీఎం పైవ్యాఖ్యలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ, ''అసదుద్దీన్, అక్బరుద్దీన్‌లకు దేశంపై భక్తి లేదని కొందరు వ్యాఖ్యానిస్తుంటారు. దేశభక్తిలో వారు మోదీ, అమిత్‌షాలకు తక్కువేం కాదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సైన్యానికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్ కుట్రల గురించి విదేశాల్లోనూ చాటిచెప్పారు'' అని రేవంత్‌రెడ్డి ఒవైసీ తరువాయి 2లో



### ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా

## బీఆర్ఎస్ కు బుద్ధి రాలేదు


- 1000 రోజుల్లో సంక్షేమానికి లక్షా 76వేల కోట్లు ఖర్చు

హైదరాబాద్: ప్రజల కోరిక మేరకు ప్రజాప్రభుత్వం పాలన చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. గత ప్రభుత్వం 3475 రోజుల్లో చేసిన 8లక్షల 20వేల కోట్లు అప్పులకు ప్రతి నెలా రూ. 6500కోట్లు అప్పు చెల్లిస్తూనే సంక్షేమం అభివృద్ధి పథకాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. ప్రజాప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తయిన సందర్భంగా బుధవారం సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్. వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ్, అజారుద్దీన్,ఎంపీ వేం నరేందర్ రెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో బి ఆర్ ఎస్ బిజెపి ఏకమై ప్రభుత్వానికి అడ్డుతగులుతున్నా సంక్షేమాన్ని ఆపలేదన్నారు. బిఆర్ ఎస్ హయాంలో తీసుకొచ్చిన మంచి కార్యక్రమాలను కొనసాగిస్తూ, గత ప్రభుత్వంలో పెండింగ్ బిల్లులను చెల్లించి మరింత సంక్షేమం అందిస్తున్నామని వివరించారు. కాళేశ్వరం కూలిన తర్వాతే రాష్ట్రంలో

తరువాయి 2లో

### 2027 వరకు ఎల్‌నినో ముప్పు

## భారత్‌కు WMO హెచ్చరిక




- 100 శాతం కొనసాగింపు అవకాశముందని డబ్ల్యూఎంఓ అంచనా
- 2026 చివరికి తీవ్ర స్థాయికి చేరే అవకాశం
- పసిఫిక్ సముద్రంలో అసాధారణ వేడి
- భారత్‌లో ఇప్పటికే 16 శాతం వర్షపాతం లోటు
- దేశంలో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం
- వ్యవసాయం, నీటి వనరులపై ఒత్తిడి ముప్పు

2లో



### జైశంకర్‌తో భేటీ..

## భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

- జెలెన్‌స్కీతో జైశంకర్ కీలక భేటీ
- యుద్ధం ముగింపుపై ప్రధానంగా చర్చ
- భారత్‌కు కృతజ్ఞతలు తెలిపిన జెలెన్‌స్కీ
- బ్లాక్ సీ పరిస్థితిపైనా చర్చ
- శాంతి ప్రక్రియలో భారత్ పాత్రపై ఉక్రెయిన్ ఆశలు

2లో

## నేపాల్‌లో జల ప్రళయం..

### బురదలో కూరుకుపోయిన పవర్ స్టేషన్




- నేపాల్‌లో వరదలకు జెప్రే పవర్ సబ్ స్టేషన్ పూర్తిగా ధ్వంసం
- బురదలో కూరుకుపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, యంత్ర పరికరాలు
- వివిధ ప్రాజెక్టుల వద్ద 900 మంది కార్మికుల ఆచూకీ గల్లంతు
- సహాయక చర్యల్లో పాల్గొంటున్న భారత్, చైనా బృందాలు
- జల విద్యుత్‌పై ఆధారపడిన నేపాల్ ఆర్థిక వ్యవస్థకు తీవ్ర దెబ్బ

2లో

## నల్సార్ వివాదం

## BCIకి సుప్రీం షాక్



- న్యాయ విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐని ఆహ్వానించడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులు
- నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులను ఎన్‌రోల్ చేయవద్దని బీసీఐ ఛైర్మన్ ఆదేశం

### అంతరిక్షం నుంచి పహారా

## ఇస్రో 'ఈవోఎస్05' ప్రయోగం

- సెప్టెంబర్ 4న ఈఓఎస్-05 ప్రయోగం
- తెల్లవారుజామున 2.55 గంటలకు లాంచ్
- జీఎస్ఎల్‌వీ-ఎఫ్17తో ఉపగ్రహ ప్రయోగం
- దాదాపు 36 వేల కి.మీ. ఎత్తులో నిఘా
- సరిహద్దులు, తీరాలపై నిఘాకు ఉపయోగం



ఢిల్లీ : దాదాపు ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. వరుసగా రెండు పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. ఈసారి జీఎస్ఎల్‌వీ ఎఫ్ 17తో ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపట్టనుంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మిషన్‌లో ఈఓఎస్05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. భూమికి దాదాపు 36వేల కిలోమీటర్ల ఎత్తులో పనిచేసే ఈ ఉపగ్రహం.. భారత్‌కు ఆకాశం నుంచి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుంది. దేశ భూభాగం, తీరప్రాంతాలు, వాతావరణ వ్యవస్థలు, విపత్తులకు గురయ్యే ప్రాంతాలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఇది ఉపయోగపడుతుంది. హై రిజల్యూషన్ కెమెరా ద్వారా సరిహద్దుల భద్రతకు కూడా తోడ్పడనుంది. ఈఓఎస్05ను సబ్‌జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టేలా మిషన్‌ను రూపొందించారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి పనిచేసే తొలి భారతీయ ఇమేజింగ్ శాటిలైట్‌గా ఈఓఎస్05 ప్రత్యేకత సాధించనుంది. దీని ప్రయోగ బరువు సుమారు 2,367 కిలోలు.

## ఏపీ, తెలంగాణలో వానలు

### అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

- తెలుగు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడి
- 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ
- ఏపీలో సెప్టెంబర్ 5 వరకు వర్షాలు కురిసే అవకాశం
- బంగాళాఖాతంలోకి మత్స్యకారులు వెళ్లవద్దని హెచ్చరిక



2లో

# అంతరిక్షం నుంచి పహారా: ఇస్రో 'ఈవోఎస్-05' ప్రయోగం

(మొదటిపేజీ తరువాయి)

దాదాపు ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. వరుసగా రెండు పీఎస్ఎల్‌వీ ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. ఈసారి జీఎస్ఎల్‌వీఎఫ్17తో ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపట్టనుంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మిషన్‌లో ఈఓఎస్05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులో పనిచేసే ఈ ఉపగ్రహం.. భారత్‌కు ఆకాశం నుంచి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుంది. దేశ భూభాగం, తీరప్రాంతాలు, వాతావరణ వ్యవస్థలు, విపత్తులకు గురయ్యే ప్రాంతాలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఇది ఉపయోగపడుతుంది. హై రిజల్యూషన్ కెమెరా ద్వారా సరిహద్దుల భద్రతకు కూడా తోడ్పడనుంది. ఈఓఎస్05ను సబ్ జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టేలా మిషన్‌ను రూపొందించారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి పనిచేసే తొలి భారతీయ ఇమేజింగ్ శాటిలైట్‌గా ఈఓఎస్05 ప్రత్యేకత సాధించనుంది. దీని ప్రయోగ బరువు సుమారు 2,367 కిలోలు. ఈ ప్రయోగానికి ఉపయోగిస్తున్న జీఎస్ఎల్‌వీఎఫ్17 రాకెట్ 51.7 మీటర్ల ఎత్తు ఉంటుంది. లిఫ్టాఫ్ సమయంలో దాని బరువు 420.5 టన్నులు. మూడు దశలతో రూపొందిన ఈ రాకెట్‌లో 4 మీటర్ల వ్యాసం ఉన్న పేలోడ్ ఫెయిరింగ్ ఉంటుంది. మొదటి దశలో భారీ ఎస్139 ఘన ఇంధన మోటార్‌తో పాటు నాలుగు ద్రవ ఇంధన బూస్టర్లు పనిచేస్తాయి. ఎస్139లోనే 138 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. నాలుగు బూస్టర్లలో కలిపి సుమారు 170 టన్నుల యూహెచ్25, నైట్రోజన్ టెట్రాక్సైడ్ ఇంధనాలు ఉంటాయి. రెండో దశలో ద్రవ ఇంధన సాంకేతికతను ఉపయోగించారు. ఇందులో 42 టన్నుల యూహెచ్25, డైనైట్రోజన్ టెట్రాక్సైడ్ ఉంటాయి. చివరి దశలో భారతీయ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ సీయూఎస్5 కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో లిక్విడ్ హైడ్రోజన్, లిక్విడ్ ఆక్సిజన్‌తో కలిపి 15 టన్నుల క్రయోజెనిక్ ఇంధనం ఉంటుంది. చివరి దశ తన పని పూర్తిచేసిన తర్వాత ఈఓఎస్05 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. ఆ తర్వాత భూమిపైకి నిరంతర నిఘా అందించే ఈ 'హాక్ ఐ' తన అసలు పని మొదలుపెట్టనుంది.

## జైశంకర్‌తో భేటీ..
## భారత్‌కు జెలెన్‌స్కీ కృతజ్ఞతలు!

ఉక్రెయిన్‌లో పర్యటిస్తున్న భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్.. అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో భేటీ అయ్యారు. భారత్ ఉక్రెయిన్ ద్వైపాక్షిక సంబంధాల బలోపేతంతో పాటు రష్యాఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపై ఇరువురు నేతలు చర్చించారు. ఈ సందర్భంగా ఉక్రెయిన్ అధ్యక్షుడు భారత్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. జైశంకర్‌తో భేటీ అనంతరం జెలెన్‌స్కీ 'ఎక్స్'లో స్పందించారు. ''ఈ అన్యాయమైన యుద్ధానికి ముగింపు పలకాలన్న భారత ఆకాంక్షకు కృతజ్ఞతలు. యుద్ధం ఆపి శాంతిని పునరుద్ధరించాలన్నదే భారత స్పష్టమైన వైఖరి'' అని పేర్కొన్నారు. నల్ల సముద్రం ప్రాంతంలో పరిస్థితులు, పౌర నౌకాయానానికి ఎదురవుతున్న ముప్పుపైనా చర్చించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ఆహారం అవసరమైన ప్రాంతాలకు సరఫరాలు అడ్డుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. తమ నౌకాశ్రయాలు, ధాన్యం కారిడార్, సరఫరాలను అడ్డుకోవడం ప్రపంచ సంబంధాల్లో తీవ్ర అంతరాయాలకు కారణమవుతోందని ఆరోపించారు. జైశంకర్ కూడా జెలెన్‌స్కీతో భేటీ వివరాలను 'ఎక్స్'లో వెల్లడించారు. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి ఆండ్రి సిబిహాతో జరిగిన చర్చలను జెలెన్‌స్కీకి వివరించినట్లు చెప్పారు. ద్వైపాక్షిక సహకారాన్ని మరింత పెంచుకోవడంతో పాటు యుద్ధానికి ముగింపు పలికే మార్గాలపైనే ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. ఉక్రెయిన్ విదేశాంగ మంత్రి సిబిహాతో జైశంకర్ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. యుద్ధం ముగింపు, బ్లాక్ సీ భద్రత, నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ ఆహార భద్రత అంశాలపై చర్చించారు.

## ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ కు బుద్ధి రాలేదు

(మొదటిపేజీ తరువాయి)

కాళేశ్వరం కూలిన తర్వాతే రాష్ట్రంలో అత్యధిక ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు. రైతుకి భరోసా, భద్రత కల్పించాం. పారదర్శకంగా పరీక్షలు నిర్వహించి 72వేల నియామకాలు చేపట్టాం. ఎన్నికల మ్యానిఫెస్టోలో చెప్పిన ప్రతి హామీని నిలబెట్టుకునేలా ప్రజా ప్రభుత్వం పని చేస్తోందనీ పేర్కొన్నారు. ప్రతిపక్షంగా ప్రభుత్వానికి సూచనలు చేయాల్సింది పోయి బిఆర్ఎస్ ప్రజల్ని రెచ్చగొడుతోందని విమర్శించారు. సంస్కారహీనంగా మాట్లాడుతున్న బావ బావమర్దులను తెలంగాణ ప్రజలు సహించరని అన్నారు. ధనిక రాష్ట్రాన్ని అప్పుల పాలుచేసిన రాష్ట్రాన్ని సరిచేసుకుంటూ పోతుంటే కారుకూతలు కూయటాన్ని ప్రజలు గమనిస్తున్నారని పొంగులేటి అన్నారు. విద్యావ్యవస్థను గత ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. ప్రజాప్రభుత్వం అన్ని రంగాలను అభివృద్ధి చేస్తూ ప్రజారంజక పాలన అందించేందుకు కృషి చేస్తున్నామని మంత్రి పొంగులేటి వివరించారు.

## ఏపీ, తెలంగాణలో వానలు..
## అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

తెలుగు రాష్ట్రాల్లో రానున్న కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణలోని హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుండగా, దానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీనికి తోడు, మధ్యప్రదేశ్ నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతోందని, వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు చేపల వేట కోసం బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద ఉండరాదని, అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

## బెదిరింపులతో భయపెట్టలేరు

హైదరాబాద్: బెదిరింపులతో తననెవరూ భయపెట్టలేరని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టంచేశారు. ముఖ్యమంత్రిగా ఉన్నందున.. ఆ కుర్చీకి ఉన్న పరిమితులను అర్థం చేసుకుని.. బాధ్యతగా పనిచేస్తున్నానని తెలిపారు. తనపై ఎవరి ఒత్తిడి లేదని, తననెవరూ ఒత్తిడి చేయలేరన్నారు. స్నేహంతో మాత్రమే తనను గెలవగలరని, దోస్తీకి గులామునని గుర్తుచేశారు. చంచల్‌గూడ నుంచి ఐఎస్ సదన్ కూడలి అవతలి వరకు 3.3 కి.మీ పొడవునా నాలుగు లైన్ల వెడల్పుతో, రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చంచల్‌గూడ వద్ద ప్రారంభించారు. అనంతరం చంచల్‌గూడ డిగ్రీ కళాశాల మైదానంలో సభలో సీఎం ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ... ''ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మీరు పులిలా ఉండేవారు.. దిల్లీ నుంచి వచ్చి బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సంతోషంగా పాల్గొన్నారు. అనంతరం వేదికపై ముభావంగా కనిపిస్తున్నారు. వీహెచ్ అన్నా.. సీఎంను మీరేమైనా అన్నారా'' అని వ్యాఖ్యానించగా... దీనికి బదులుగా సీఎం పైవ్యాఖ్యలు చేశారు. అనంతరం సీఎం మాట్లాడుతూ, ''అసదుద్దీన్, అక్బరుద్దీన్‌లకు దేశంపై భక్తి లేదని కొందరు వ్యాఖ్యానిస్తుంటారు. దేశభక్తిలో వారు మోదీ, అమిత్‌షాలకు తక్కువేం కాదు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సైన్యానికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. పాకిస్థాన్ కుట్రల గురించి విదేశాల్లోనూ చాటిచెప్పారు'' అని రేవంత్‌రెడ్డి ఒవైసీ సోదరులకు కితాబిచ్చారు.

## 2027 వరకు ఎల్‌నినో ముప్పు: భారత్‌కు WMO హెచ్చరిక

వాతావరణ మార్పులపై 'ప్రపంచ వాతావరణ సంస్థ' (డబ్ల్యూఎంఓ) కీలక హెచ్చరిక చేసింది. పసిఫిక్ మహాసముద్రంలో ఎల్‌నినో ప్రభావం వేగంగా బలపడుతోందని తెలిపింది. ఈ ఏడాది చివరి నాటికి ఇది చాలా తీవ్ర స్థాయికి చేరుకునే అవకాశం ఉందని పేర్కొంది. అంతేకాదు.. ఎల్‌నినో ప్రభావం 2027 ఫిబ్రవరి వరకు కొనసాగేందుకు 100 శాతం అవకాశం ఉందని తాజా అంచనాలో వెల్లడించింది. సెప్టెంబర్ 3న విడుదల చేసిన తాజా నివేదికలో డబ్ల్యూఎంవో ఇంతటి అధిక స్థాయి విశ్వాసంతో ఎల్‌నినో కొనసాగింపుపై అంచనా వేయడం ఇదే తొలిసారి. పసిఫిక్ సముద్ర ఉపరితలంతో పాటు లోతైన జలాల్లోనూ అసాధారణంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇవి ఎల్‌నినో మరింత బలపడేందుకు అనుకూల పరిస్థితులను సృష్టిస్తున్నాయి.

**పసిఫిక్‌లో అసాధారణ వేడి**

ఎల్‌నినో అనేది మధ్య, తూర్పు ఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు సాధారణం కంటే ఎక్కువగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియ. దీని ప్రభావం పసిఫిక్ ప్రాంతానికే పరిమితం కాదు. ప్రపంచంలోని అనేక ప్రాంతాల్లో వర్షపాతం, ఉష్ణోగ్రతల తీరును మార్చగలదు. ఎల్‌నినోను పర్యవేక్షించే కీలక ప్రాంతమైన నినో 3.4లో మే నుంచి జులై 2026 వరకు సముద్ర ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 1.5 డిగ్రీల సెల్సియస్ ఎక్కువగా ఉన్నాయి. జులైలో ఈ తేడా 2 డిగ్రీలకు చేరింది. జులై చివరి నుంచి ఆగస్టు మధ్య వరకు వారపు ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2.2 నుంచి 2.6 డిగ్రీల వరకు ఎక్కువగా నమోదయ్యాయి. సముద్రం అడుగుభాగంలో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. జులై, ఆగస్టు ప్రారంభంలో కొన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే 8 డిగ్రీల సెల్సియస్ వరకు అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో 2026 చివరి నాటికి ఎల్‌నినో చాలా బలమైన స్థాయికి చేరుకోవచ్చని డబ్ల్యూఎంఓ అంచనా వేస్తోంది.

**భారత్‌పై ఎలాంటి ప్రభావం?**

ఎల్‌నినో ప్రభావం అన్ని దేశాల్లో ఒకేలా ఉండదు. అయితే భారత్‌కు ఇది కీలకమైన వాతావరణ సంకేతం. సాధారణంగా ఎల్‌నినో బలపడిన సంవత్సరాల్లో నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉంటుంది. ఫలితంగా వర్షపాతం తగ్గే పరిస్థితులు ఏర్పడొచ్చు. భారత్‌లో 2026 నైరుతి రుతుపవనాలపై భారత వాతావరణ విభాగం (ఐఎండీ) ఇప్పటికే ఆందోళనకర అంచనా ఇచ్చింది. మేలో విడుదల చేసిన అంచనాలో సీజన్ మొత్తం వర్షపాతం దీర్ఘకాల సగటులో 90 శాతంగా ఉండొచ్చని పేర్కొంది. లోటు వర్షపాతం నమోదయ్యే అవకాశం 60 శాతంగా అంచనా వేసింది. ఆ అంచనాలకు అనుగుణంగానే ఆగస్టు ముగిసే నాటికి దేశంలో వర్షపాతం 16 శాతం లోటుగా నమోదైంది.

**వేడి, కరవు.. కొన్ని చోట్ల భారీ వర్షా లు!**

ఎల్‌నినో బలపడటంతో ప్రపంచంలోని వివిధ ప్రాంతాల్లో తీవ్రమైన వేడి, కరవు, వరదల ముప్పు పెరగొచ్చని డబ్ల్యూఎంఓ హెచ్చరిస్తోంది. సెప్టెంబర్ నవంబర్ మధ్య దాదాపు అన్ని భూభాగాల్లో సాధారణం కంటే అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. అయితే వర్షపాతం మాత్రం ప్రాంతాన్ని బట్టి మారుతుందని తెలిపింది. భారత్‌పై ఎల్‌నినో ప్రభావాన్ని ఇండియన్ ఓషన్ డైపోల్ (ఐఓడీ) కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఈ సమయంలో పాజిటివ్ ఐఓడీ ఏర్పడే అవకాశం ఉందని అంచనా. దీంతో ఎల్‌నినో వల్ల భారత్‌లో సాధారణంగా కనిపించే ప్రభావాల్లో కొంత మార్పు రావొచ్చని నిపుణులు చెబుతున్నారు.

- **వ్యవసాయం నుంచి నీటి వనరుల వరకు..**

ఎల్‌నినో 2027 ప్రారంభం వరకు కొనసాగితే దాని ప్రభావం ఒక్క సీజన్‌కే పరిమితం కాకపోవచ్చు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్యుత్, నీటి వనరుల వంటి వాతావరణంపై ఆధారపడే రంగాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అందుకే ప్రభుత్వాలు, వాతావరణ సంస్థలు ముందస్తు హెచ్చరికలు, విపత్తు సన్నద్ధత చర్యలను మరింత బలోపేతం చేయాలని డబ్ల్యూఎంఓ సూచిస్తోంది. ఎల్‌నినో సహజమైన వాతావరణ చక్రంలో భాగమే. అయితే ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికే ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పెరుగుతున్న సమయంలో ఇది మరింత ఒత్తిడిని పెంచే అవకాశం ఉందని డబ్ల్యూఎంఓ హెచ్చరిక స్పష్టం చేస్తోంది.

## నేపాల్‌లో జల ప్రళయం.. బురదలో కూరుకుపోయిన పవర్ స్టేషన్

నేపాల్‌ను భారీ వరదలు అతలాకుతలం చేస్తున్నాయి. ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల ధాటికి ఆ దేశంలోని జల విద్యుత్ రంగం తీవ్రంగా దెబ్బతింది. చైనా సరిహద్దుకు సుమారు 84 కిలోమీటర్ల దూరంలో ఉన్న గల్చీ ప్రాంతంలోని 'జెహ్రే' పవర్ సబ్‌స్టేషన్ పూర్తిగా నీట మునిగి బురదలో కూరుకుపోయింది. త్రిశూలి నదికి ఆనుకొని ఉన్న ఈ విద్యుత్ కేంద్రం మొత్తం బురదమయమైంది. ట్రాన్స్‌ఫార్మర్లు, ఇతర యంత్ర పరికరాలు ధ్వంసమై బురదలో కూరుకుపోయాయి. ప్రస్తుతం నేపాల్ సైనిక దళాల సహాయక చర్యల్లో నిమగ్నమై, బురదలో కూరుకుపోయిన యంత్రాలను వెలికితీసేందుకు శ్రమిస్తున్నాయి. నదీ తీరం వెంబడి ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లు, తెగిపడిన విద్యుత్ తీగలు వరద ఉద్ధృతికి నిదర్శనంగా కనిపిస్తున్నాయి. వరద సంభవించిన సమయంలో విధుల్లో ఉన్న రమేశ్ అనే ఎలక్ట్రీషియన్ ఆ భయానక పరిస్థితులను వివరించారు. "ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తోందన్న హెచ్చరికలతో ప్రాణాలు కాపాడుకోవడానికి కొండపైకి పరుగులు తీశాం. చూస్తుండగానే నీటి మట్టం అకస్మాత్తుగా పెరిగి, సబ్‌స్టేషన్‌ను పూర్తిగా ముంచేసింది" అని ఆయన తెలిపారు. స్టేషన్ గోడలపై పైకప్పు వరకు కనిపిస్తున్న నీటి మరకలు వరద బీభత్సాన్ని చాటిచెబుతున్నాయి. ఈ విపత్తు కేవలం ఒక ప్రాంతానికే పరిమితం కాలేదు. దేశవ్యాప్తంగా వివిధ జల విద్యుత్ ప్రాజెక్టుల వద్ద విధులు నిర్వహిస్తున్న సుమారు 900 మంది కార్మికులు, ఉద్యోగుల ఆచూకీ ఆగస్టు 26 నుంచి లభించడం లేదు. వీరిలో అధిక శాతం మంది సొరంగాల్లో చిక్కుకుపోయి ఉంటారని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న సహాయక చర్యల్లో నేపాల్ బృందాలకు భారత్, చైనాలకు చెందిన నిపుణులు కూడా సహకరిస్తున్నారు. జల విద్యుత్ ఉత్పత్తి, ఎగుమతులపైనే ప్రధానంగా ఆధారపడే నేపాల్ ఆర్థిక వ్యవస్థకు ఈ విపత్తు పెను సవాలుగా మారింది.

## నల్సార్ వివాదం: BCIకి సుప్రీం షాక్

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్‌ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

## ఇంగ్లండ్ తీరంలో పురాతన అగ్నిపర్వతం..
### 45 కోట్ల ఏళ్ల నాటి రహస్యం వెలుగులోకి!

భూగర్భంలో దాగి ఉన్న ఓ అద్భుతాన్ని శాస్త్రవేత్తలు ప్రపంచం ముందు ఆవిష్కరించారు. ఇంగ్లండ్ తూర్పు తీరం కింద లక్షల సంవత్సరాల క్రితం అంతరించిపోయిన ఒక అతి భారీ సూపర్‌వొల్కనో (మహా అగ్నిపర్వతం) ఆనవాళ్లను కనుగొన్నారు. ఈ అగ్నిపర్వతం ప్రస్తుతం ఉన్న ఎట్నా పర్వతం కంటే వేల రెట్లు శక్తిమంతమైనదని, సుమారు 45.4 కోట్ల సంవత్సరాల క్రితం ఇది బద్దలైందని పరిశోధకులు వెల్లడించారు. అంటే.. భూమిపై డైనోసార్లు సంచరించడానికి దాదాపు 20 కోట్ల ఏళ్ల ముందే ఈ భారీ విస్ఫోటనం సంభవించింది. ఈ పేలుడు వేల హైడ్రోజన్ బాంబులు విడుదల చేసే శక్తితో సమానమని శాస్త్రవేత్తలు అంచనా వేస్తున్నారు. ఈ సంచలన ఆవిష్కరణకు సంబంధించిన వివరాలను బీబీసీ తన కథనంలో వెల్లడించింది. దశాబ్దాలుగా నార్వే, స్వీడన్, బెలారస్, పోలాండ్ వంటి ఉత్తర యూరప్ దేశాల్లోని పురాతన శిలల పొరల్లో 'కిన్నెకుల్లె టెఫ్రా' అని పిలిచే అగ్నిపర్వత బూడిద నిక్షేపాలు శాస్త్రవేత్తలకు కనిపిస్తున్నాయి. ఇంత విస్తారంగా బూడిదను వెదజల్లిన అగ్నిపర్వతం ఎక్కడుందో గుర్తించడం వారికి పెద్ద సవాలుగా మారింది. తాజాగా బ్రిటిష్ జియోలాజికల్ సర్వే (బీజీఎస్), ఓస్లో విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రవేత్తల బృందం చేసిన పరిశోధన ఈ మిస్టరీకి తెరదించింది. ఇంగ్లండ్‌లోని నార్ఫోక్, లింకన్‌షైర్ ప్రాంతాల కింద, 'ది వాష్' అని పిలిచే సముద్ర తీర ప్రాంతంలో ఈ సూపర్‌వొల్కనో కేంద్రీకృతమై ఉందని వారు నిర్ధారించారు. ఈ ఆవిష్కరణ కోసం శాస్త్రవేత్తలు సుమారు 80 ఏళ్ల క్రితం పరిశోధనల కోసం తవ్విన బోర్‌వెల్స్ నుంచి సేకరించిన రాతి నమూనాలను మళ్లీ పరిశీలించారు. వందల మీటర్ల లోతు నుంచి తీసిన ఈ నమూనాల్లోని జిర్కాన్, అపటైట్ వంటి సూక్ష్మ స్ఫటికాలను విశ్లేషించడం ద్వారా అగ్నిపర్వతం యొక్క మూలాన్ని కనుగొన్నారు. ఈ ఆవిష్కరణపై బీజీఎస్‌కి చెందిన డాక్టర్ టిమ్ ఫారో మాట్లాడుతూ.. "ఇది ఒక అద్భుతమైన ఫలితం. ఇంగ్లండ్ యొక్క పురాతన భూగర్భ చరిత్రపై మాకున్న అవగాహనను ఇది పూర్తిగా మార్చేస్తుంది" అని వ్యాఖ్యానించారు. బ్రిస్టల్ యూనివర్సిటీకి చెందిన అగ్నిపర్వత నిపుణురాలు ప్రొఫెసర్ జెన్నీ బార్క్లే కూడా ఈ పరిశోధనను ప్రశంసించారు. "యూకే భూగర్భ చరిత్రను అర్థం చేసుకోవడంలో ఇది ఒక ముఖ్యమైన ముందడుగు. నీరు, ఖనిజాలు వంటి సహజ వనరుల వినియోగంలో భూగర్భ నిర్మాణం ప్రాముఖ్యతను ఇది తెలియజేస్తుంది" అని ఆమె పేర్కొన్నారు. సాధారణంగా 1,000 క్యూబిక్ కిలోమీటర్ల కంటే ఎక్కువ పదార్థాన్ని బయటకు వెదజల్లే అగ్నిపర్వతాలను 'సూపర్‌వొల్కనోలు' అంటారు.

# అంగన్వాడీల్లో చిన్నారులకు ఆహ్లాదకర వాతావరణం కల్పించాలి

***జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**



ప్రజా స్ఫూర్తి, భైంసా : అంగన్వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులు ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేలా అన్ని రకాల మౌలిక వసతులు, ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గురువారం నిర్మల్ గ్రామీణ మండలం రత్నాపూర్ కాండ్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలోని రికార్డులను పరిశీలించి, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లోని చిన్నారులందరినీ అంగన్వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవ తీసుకోవాలని సూచించారు. కేంద్రాలను పిల్లలను ఆకట్టుకునే విధంగా రంగురంగుల బొమ్మలు, పెయింటింగ్స్, వర్ణమాల, విద్యా చార్టులతో అలంకరించి, ఆటపాటల ద్వారా చిన్నారులకు విద్యాబోధన అందించాలని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడేలా ప్రతిరోజూ పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటలు, రైమ్స్ వంటి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి, ఎత్తు, బరువు తదితర వివరాలను ఎప్పటికప్పుడు రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు.

సామ్, మామ్ పిల్లలపై ప్రత్యేక దృష్టి

సామ్ , మామ్ కేటగిరీకి చెందిన పిల్లల వివరాలను పకడ్బందీగా నమోదు చేసి, పోషకాహార లోపం ఉన్న చిన్నారులకు అదనపు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి గర్భిణి, బాలింతకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, పోషకాహార సేవలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తనిఖీ సందర్భంగా కలెక్టర్ చిన్నారులతో సరదాగా ముచ్చటించారు. వారి పేర్లు, చదువు గురించి అడిగి తెలుసుకుని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా అంగన్వాడీ కేంద్రానికి రావాలని సూచించారు. చిన్నారులతో రైమ్స్ చెప్పించి, సంఖ్యలు చదివించడంతో పాటు వారికి చాక్లెట్లు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి వినూత్న, వైద్యారోగ్య శాఖ అధికారులు పవన్ కుమార్, సౌమ్య, నయనా రెడ్డి, రమేష్, అలీ, సర్పంచ్ హరీష్, ఉప సర్పంచ్ భూమేష్, అంగన్వాడీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బైంసా డివిజనల్ సబ్ కలెక్టర్ కు ఎస్ ఐ ఆర్ పై వినతి పత్రం



ప్రజాస్ఫూర్తి , భైంసా:ఎస్ అర్ ఐ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వారికి ఒక వినతిపత్రం సమర్పించారు. ముఖ్యంగా కొందరు వయోవృద్ధులు నోటీసులు తీసుకున్న వారు బిఎల్ఓ లదగ్గర వెళ్ళటానికి కష్టమవుతుంది. అందువలన బి ఎల్ ఓ లను వారి ఇంటికి పంపించి కావలసిన ధ్రువపత్రాలను తీసుకోవాలని లేదా ఎవరైనా వారి కుటుంబ సభ్యులు బి ఎల్ ఓ లదగ్గర వెళ్లటానికి అనుమతించగలరని కోరడంజరిగింది. అక్షరాలలో చిన్న పదం తప్పు వచ్చిన చిన్న అక్షరం రాకపోయినా దానిని రిజెక్ట్ చేస్తున్నారు ఈ కారణాలపై రిజెక్ట్ చేయకుండా చూడాలని కోరారు. కొందరు ప్రజల దగ్గర ఎలక్షన్ కమిషన్ వారు చూయించిన 16 డాక్యుమెంట్లను ఏ డాక్యుమెంటు లేకుండా గాని తాసిల్దార్ ధ్రువీకరణ పత్రంపై ఓటర్గా రిజిస్టర్ చేయాలని కోరడం జరిగింది.ఖరారు చేసిన తేదీలలో నమోదు కాకుంటే మరసటి రోజుకు అనుమతి ఇవ్వాలని కోరారు. నోటీసులు త్వరగా అందేటట్లు చూడాలని కోరనైనది.మరియు బైంసా పట్టణంలోని పోలింగ్ స్టేషన్ 148 బంగలగల్లీ లో బి ఎల్ ఓ లుపనిచేస్తున్న తీరును పరిశీలించటం జరిగింది.ఈ కార్యక్రమంలో బైంసా మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి ఫారుక్ అహ్మద్, మాజీ జిల్లా జడ్పీ వైస్ చైర్మన్ రాజన్న, మాజీ జెడ్పిటిసి ఉత్తమ్ భలే రావు, మాజీ ఏఎంసీ వైస్ చైర్మన్ ఆసిఫ్, మాజీ ఎంపీటీసీ మాణిక్ రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఎస్డి లల, ఫరూక్,గంగాధర్,తదితరులు ఉన్నారు.

# గుండెపోటుతో లారీ డ్రైవర్ మృతి



గరిడేపల్లి ప్రజాస్ఫూర్తి: మండలంలోని రాయినిగూడెం గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ గుండు లింగరాజు (40) గుండెపోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా బయ్యారం సమీపంలో ఫ్లైయాష్ లోడు చేసుకుని తిరిగి వస్తుండగా మార్గమధ్యలో పత్తిపాడు మండలం ధర్మవరం గ్రామం వద్ద లింగరాజుకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చింది. దీంతో లారీ క్యాబిన్‌లోనే మృతి చెందినట్లు తెలిపారు. లింగరాజుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆయన మృతితో రాయినిగూడెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

# కృష్ణుడి చిరునవ్వులు గోపికమ్మల సందడి



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణ కేంద్రంలోని తక్షశిల విస్డం స్కూల్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ముందస్తుగా ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికమ్మల వేషధారణలతో పాఠశాల ప్రాంగణం పండుగ శోభను సంతరించుకుంది.శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని విద్యార్థులు ఎంతో అందంగా శ్రీకృష్ణుడు, గోపికమ్మల వేషధారణలో ముస్తాబయ్యారు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు నెమలి పింఛం,కిరీటంతో మురిపించగా గోపికమ్మల వేషధారణలో బాలికలు సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. చిన్నారుల ముద్దుముద్దు వేషధారణలు, చిరునవ్వులు, ఉత్సాహం వేడుకలకు మరింత శోభను తీసుకొచ్చాయి.ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమని తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని ప్రశంసించారు.ఈ కార్యక్రమానికి పాఠశాల ప్రిన్సిపాల్ శిజో కురియన్, డైరెక్టర్ దామోదర్ రెడ్డి, కరెస్పాండెంట్ మల్నారెడ్డి మార్గదర్శకత్వం అందించారు. ఉపాధ్యాయులు నాగరాజు, ప్రవీణ్, ఏడ్విన్, బియ్యబాని, దీపశిజో, అనిత, షరీఫా తదితరులు పాల్గొన్నారు.

# ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయండి

**: టీజీఈజేఏసీ**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ఉద్యోగుల న్యాయమైన పెండింగ్ సమస్యల సాధనకై సెప్టెంబర్ 10న నిర్వహించనున్న ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని ఉద్యోగుల, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్లకు టీజిఈజెఏసి భద్రాద్రి జిల్లా చైర్మన్ అమరనేని రామారావు, కన్వీనర్ సంగం వెంకట పుల్లయ్యలు పిలుపునిచ్చారు. కొత్తగూడెంలోని టీజీఓ జిల్లా కార్యాలయంలో జిల్లాలోని టీజీఈజేఏసీ సభ్యుల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2వ పీఆర్సీ వెంటనే అమలు చేయాలని, పెండింగ్ లో ఉన్న 6 డీఏలను విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని, పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని, నూతన ఈహెచ్ఎస్‌ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకై సెప్టెంబర్ 10న ఛలో హైదరాబాద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టీఈజేఏసీ నాయకులు ఎం.రాజయ్య, ఎస్. వెంకటేశ్వర్లు, ఎస్.కె. జహంగీర్ షరీఫ్, ఎస్.బాలకృష్ణ, బి.వెంకటేశ్వర్లు, విఆర్.లక్ష్మణరావు, ఏ.వెంకటేశ్వర్లు, టి.శ్రీనివాసరెడ్డి, వేస్లీ, జి.వెంకటేశ్వర్లు, వి.శ్రీనివాసరావు, డి.తావుర్య, వి.శ్రీనివాస్, కె.దేశపతి, వై.మల్లికార్జురావు, కెటి.రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

# కాలుష్య కోరల్లో మున్నేరు వాగు!

* **కళ్లముందే కలుషితమవుతున్న మున్నేరు వాగు స్పందన కోసం ఎదురుచూపులు**



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : మహబూబాబాద్ పట్టణానికి సహజ జలవనరుగా ఉన్న మున్నేరు వాగు క్రమంగా కాలుష్య భారాన్ని మోస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. మురుగునీరు, చెత్తాచెదారం,ప్లాస్టిక్ వ్యర్థాలు మున్నేరు వాగులో చేరుతుండటంతో నీటి స్వచ్ఛత ప్రశ్నార్థకంగా మారుతోంది.పట్టణ కేంద్రంలోనే ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కాలుష్యం పెరుగుతున్నకొద్దీ మున్నేరువాగు సహజ స్వరూపం కనుమరుగవుతుండగా, సంబంధిత వ్యవస్థల నుంచి ఆశించిన స్థాయిలో చర్యలు ఎప్పుడు కనిపిస్తాయన్న చర్చ కొనసాగుతోంది. గతంలో కూడా మున్నేరువాగు పరిధిలో చెత్త కారణంగా కాలుష్య సమస్యపై ఆందోళనలు వ్యక్తమైనట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే పట్టణ కేంద్రంలో మున్నేరువాగు స్వచ్ఛతను కాపాడేందుకు సమగ్ర చర్యలు మరింత అవసరమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

* **"మున్నేరువాగును కాపాడేది ఎప్పుడు..?"**

సహజ జలవనరు మురికిని మోస్తుంటే, దానిని స్వచ్ఛంగా మార్చే చర్యలు ఎప్పుడు ప్రారంభమవుతాయన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. కళ్లముందే కలుషితమవుతున్న మున్నేరుపై సంబంధిత అధికారులు స్పందించి చర్యలు చేపడతారా..? లేక కాలుష్య ప్రవాహం ఇలాగే కొనసాగుతుందా..? అన్నది వేచి చూడాల్సిందే అని ప్రజలు వాపోతున్నారు.

# గీకురు రవీందర్ మృతి ముదిరాజ్ సమాజానికి తీరని లోటు

* **రవీందర్ భౌతికకాయానికి ముదిరాజ్ మహాసభ నేతల ఘన నివాళులు..**



చిగురుమామిడి,ప్రజాస్ఫూర్తి:ముదిరాజ్ ల హక్కుల సాధన కోసం నిరంతరం శ్రమించిన ఉద్యమ నేత గీకురు రవీందర్ భౌతికకాయాన్ని తెలంగాణ ముదిరాజ్ మహాసభ నాయకులు సందర్శించి,ఆయన పార్థివదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రవీందర్ కుటుంబ సభ్యులను పరామర్శించి,తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. రవీందర్ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు ఈ తీవ్ర విషాదాన్ని భరించే మనోధైర్యాన్ని ఆ భగవంతుడు ప్రసాదించాలని ఈ సందర్భంగా ప్రార్థించారు.ఈ సందర్భంగా తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్ మాట్లాడుతూ గీకురు రవీందర్ మృతి ముదిరాజులకు తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజ్ సమాజం ఒక గొప్ప నాయకుడిని కోల్పోయిందని, హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాలు ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొని రవీందర్ కు నివాళులు అర్పించిన వారిలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం,ముదిరాజ్ మహాసభ యువత రాష్ట్ర అధ్యక్షులు పండుగ బాలు,రామడుగు మార్కెట్ కమిటీ చైర్మన్ బొమ్మరవేణి తిరుపతి, వెంకటేశ్వరపల్లె సర్పంచ్ రాయిశెట్టి చంద్రయ్య,మహాసభ జిల్లా ఉపాధ్యక్షులు భాషవేణి శ్రీను,గూడూరి తిరుపతి,ముదిరాజ్ మహాసభ యువత జిల్లా అధ్యక్షులు రెడ్డి సురేష్,యువత జిల్లా ఉపాధ్యక్షులు గందె రమేష్,ముదిరాజ్ మహాసభ హుస్నాబాద్ నియోజకవర్గ అధ్యక్షులు మద్ది పవన్,మానకొండూర్ నియోజకవర్గ యువత అధ్యక్షులు గుల్ల రాజు,కేశవపట్నం మండల అధ్యక్షులు పూలవేణి బిక్షపతి, తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

* **గరిడేపల్లి లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా బైక్ ర్యాలీ**



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ పాలన లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని మండల పార్టీ అధ్యక్షులు త్రిపురం అంజన్ రెడ్డి అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా మండల కేంద్రంలో పార్టీ నాయకులు ఆనందోత్సవాల మధ్య బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ రైతు రుణమాఫీ రైతు భరోసా ఉచిత విద్యుత్ గ్యాస్ సిలిండర్ ఇందిరమ్మ ఇల్లు కొత్త రేషన్ కార్డులు సన్న బియ్యం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వడ్డీ లేని రుణాలు వంటి పథకాలను ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేసిందని అన్నారు. మంత్రి ఉత్తం సహకారంతో హుజూర్నగర్ నియోజకవర్గం అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రంగనాథ్ కటికం ఆశా రమేష్ వర్కింగ్ ప్రెసిడెంట్ సీతారాం రెడ్డి యువజన సంఘం జిల్లా అధ్యక్షులు కృష్ణప్రసాద్ మాజీ సర్పంచ్లు సుందరి నాగేశ్వరరావు కటికం వేణు నాయకులు పరమేష్ వెంకటేశ్వర్లు చాందిమియా సందీప్ పలువురు నాయకులు పాల్గొన్నారు

# కెసిఆర్ ప్రతిపక్ష హోదాఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి

**మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ**



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: మాజీ ముఖ్యమంత్రి ప్రస్తుత ఎమ్మెల్యే కెసిఆర్ తన ప్రతిపక్ష హోదాకి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ వలిగొండ మండల కేంద్రంలో మండల కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు బత్తిని సహదేవ్, పట్టణ అధ్యక్షుడు పోలేపాక జానకి రాములు మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ ఎమ్మెల్యేగా గెలిచి ప్రతిపక్ష హోదాను కలిగి ఉండి అసెంబ్లీకి రాకుండా ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నాడని అటువంటి వ్యక్తి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో సంక్షేమ పథకాలను అందించడం జరిగిందని వారు తెలిపారు కెసిఆర్ ప్రతిపక్ష హోదాలో ఉండి ఇప్పటివరకు 27 కోట్ల కు పైగా వేతనాన్ని తీసుకున్నాడని కానీ ప్రజా సమస్యలపై ఏ ఒక్కరోజు కూడా అసెంబ్లీకి వచ్చి చర్చించడం లేదని వారన్నారు ఇప్పటికైనా కెసిఆర్ ఎమ్మెల్యే ప్రతిపక్ష హోదాకి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వాకిటి అనంతరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి వలిగొండ సింగిల్ విండో చైర్మన్ గరిసే రవి వైస్ చైర్మన్ జంగారెడ్డి నాయకులు బద్దం సంజీవరెడ్డి గుండు దానయ్య గౌడ్ కొండూరు భాస్కర్ కాసుల వెంకన్న గౌడ్ బత్తిని నాగేష్ ఐటిపాముల రవీంద్ర గంగదారి రాములు వలిగొండ ఉపసర్పంచ్ మలగ మాధవి వెంకటేష్ చిలుగూరు సత్తిరెడ్డి ఇంకాప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సంస్కృతి–సంప్రదాయాపై అవగాహన.. గ్రీన్ గ్రోవ్ లక్ష్యం

**- గ్రీన్ గ్రోవ్ లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు**
**- బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి**



చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: విద్యార్థి దశలోనే చిన్నారులకు భారతీయ సంస్కృతి-సంప్రదాయాపై అవగాహన కల్పించడం గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్ లక్ష్యమని పాఠశాల చైర్మన్ బండి వీణ అనిల్ కుమార్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలో అందంగా ముస్తాబై, సాంప్రదాయ దుస్తులతో అలరించారు. చిన్నారులు శ్రీకృష్ణుడి బాల్యలీలలు, రాధాకృష్ణుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి అందరినీ ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రాంగణం శ్రీకృష్ణుని నామస్మరణతో, చిన్నారుల కేరింతలతో సందడిగా మారింది. గ్రీన్ గ్రోవ్ ఇన్‌స్టిట్యూషన్స్ చైర్మన్ వీణ అనిల్ కుమార్ రెడ్డి, డైరెక్టర్ లక్ష్మి, ఏఓ మురళి పాల్గొని చిన్నారులకు శ్రీకృష్ణాష్టమి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ చిన్నారులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల ప్రాముఖ్యతను తెలుసుకోవడం ఎంతో అవసరమన్నారు. విద్యార్థుల అద్భుతమైన వేషధారణలు, ప్రదర్శనలను అభినందిస్తూ, ఇటువంటి సాంస్కృతిక కార్యక్రమాలు పిల్లల్లో సృజనాత్మకతతో పాటు మన సంప్రదాయాలపై అవగాహనను పెంపొందిస్తాయన్నారు.

# కొత్తపేట పాఠశాలలో కన్నుల పండువగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , జన్నారం:జన్నారం మండలంలోని కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను అత్యంత వైభవంగా, కన్నుల పండువగా నిర్వహించారు. పాఠశాల ప్రాంగణమంతా శ్రీకృష్ణుడి నామస్మరణతో మార్మోగింది.ఈ వేడుకల్లో భాగంగా చిన్నారులు ధరించిన శ్రీకృష్ణుడు, రాధ వేషధారణలు అందరినీ ఎంతగానో ఆకట్టుకున్నాయి. చిన్ననాటి కృష్ణుడి లీలను తలపించేలా విద్యార్థులు చేసిన అల్లరి అందరి ముఖాల్లో చిరునవ్వులు పూయించింది.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిక్కు మాట్లాడుతూ, కేవలం చదువు మాత్రమే కాకుండా ఇలాంటి సాంస్కృతిక వేడుకలు విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు, వారిలో నైతిక విలువలను పెంపొందించడానికి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ పండుగల విశిష్టతను తెలుసుకోవాలని ఆయన సూచించారు.ఈ వేడుకల విజయవంతం వెనుక ఉపాధ్యాయురాలు సౌందర్య ప్రత్యేక కృషి చేశారు. ఆమె పర్యవేక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొని చిన్నారులను అభినందించారు. అంతటా పండుగ వాతావరణం నెలకొనడంతో చిన్నారులు ఎంతో ఆనందంగా గడిపారు.

# లోక్ కళ్యాణ్ మేడను చిరు వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలి

**లీడ్ బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్**

ప్రజాస్ఫూర్తి, భైంసా: వీధి వ్యాపారులను ఆర్థికంగా బలోపేతం చేసి, వారికి చేయూత అందించేందుకు అమలు చేస్తున్న లోక్ కళ్యాణ్ మేళా కు సంబంధించి భైంసా మున్సిపల్ కార్యాలయంలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రామ్ గోపాల్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 1 నుండి 30, 2026 వరకు దేశవ్యాప్తంగా ప్రత్యేక స్వనిధి ప్రచారం, లోక్ కళ్యాణ్ మేళా మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పురపాలక సంఘ పరిధులలోనూ, వివిధ బ్యాంక్ శాఖలలోనూ అర్హులైన వీధి వ్యాపారులకు బ్యాంక్ రుణాలు అందించడమే ధ్యేయంగా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని అన్నారు. వీధి వ్యాపారాలను మరింత విస్తరించుకోవడానికి అలాగే ఆర్థిక స్వావలంబన సాధించడానికి ప్రభుత్వం అందిస్తున్న ఈ స్వనిధి పథకం ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి వీధి వ్యాపారి ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు కుమార్, నరేష్ బాబు, ప్రియమ్ జీత్ సింగ్, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

# అనుమతికి మించి వైద్యం.. 7 క్లినిక్‌లు, ల్యాబ్ సీజ్

* హత్నూర, దౌల్తాబాద్‌లో వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆకస్మిక తనిఖీలు
* ఆర్‌ఎంపీలు, పీఎంపీలు పరిధి దాటితే కఠిన చర్యలు: డీఐఓ డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే



హత్నూర, (ప్రజాస్ఫూర్తి): అనుమతులకు మించి వైద్య సేవలు అందిస్తున్న క్లినిక్‌లపై వైద్య ఆరోగ్యశాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. నిబంధనలకు విరుద్ధంగా వైద్యం నిర్వహిస్తున్నారన్న సమాచారంతో గురువారం హత్నూర మండలంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మండల కేంద్రమైన హత్నూరలో మూడు, దౌల్తాబాద్‌లో నాలుగు క్లినిక్‌లతో పాటు ఓ హెల్త్‌కేర్ ల్యాబ్‌ను అధికారులు సీజ్ చేశారు. తనిఖీల సందర్భంగా పలు క్లినిక్‌లలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలు తమకు అనుమతించిన పరిధిని దాటి వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ముఖ్యంగా సెలైన్లు పెట్టడం, ఇంజక్షన్లు ఇవ్వడం, ల్యాబొరేటరీ పరీక్షలు నిర్వహించడం వంటి సేవలను నిబంధనలకు విరుద్ధంగా అందిస్తున్నట్లు తనిఖీల్లో వెల్లడైనట్లు అధికారులు తెలిపారు.

* నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ఈ సందర్భంగా డీఐఓ డాక్టర్ శశాంక్ దేశ్‌పాండే మాట్లాడుతూ.. ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కేవలం తమకు అనుమతించిన పరిధిలో ప్రాథమిక చికిత్సలు మాత్రమే అందించాలని స్పష్టం చేశారు. నిబంధనలను ఉల్లంఘించి అనుమతికి మించి వైద్య సేవలు అందిస్తున్న ఏడు క్లినిక్‌లను సీజ్ చేసినట్లు తెలిపారు. అదేవిధంగా దేవి క్లినిక్, హెల్త్‌కేర్ ల్యాబ్‌లకు రూ.25 వేల చొప్పున జరిమానా విధించినట్లు వెల్లడించారు. వైద్య సేవల పేరుతో ప్రజల ఆరోగ్యానికి ముప్పు కలిగించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని అధికారులు హెచ్చరించారు.

## మండల స్థాయి క్రీడా పోటీల్లో సత్తా చాటిన సెయింట్ జోసెఫ్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు

* పతకాల పంటతో పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు



గరిడేపల్లి, ప్రజాస్ఫూర్తి: సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండల పరిధిలోని వెలిదండ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడా పోటీల్లో పొనుగోడు గ్రామానికి చెందిన సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి సత్తా చాటారు. వివిధ క్రీడాంశాల్లో పోటీపడిన విద్యార్థులు ఉత్తమ ప్రదర్శనతో విజయాలు సాధించి పాఠశాలకు మంచి పేరు తీసుకొచ్చారు.క్రీడా మైదానంలో విద్యార్థులు చూపిన ప్రతిభ, పట్టుదల, క్రమశిక్షణ అందరినీ ఆకట్టుకుంది. విజేతలుగా నిలిచిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని, భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మరిన్ని విజయాలు సాధించాలని పాఠశాల యాజమాన్యం ఆకాంక్షించింది. క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పాఠశాల కరెస్పాండెంట్ రెవరెంట్ ఫాదర్ స్వామినాథన్ , అడ్మినిస్ట్రేటర్ రెవరెంట్ ఫాదర్ ప్రశాంత్ కుమార్, ప్రిన్సిపల్ సిస్టర్ స్పందన, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు తదితరులు అభినందనలు తెలిపారు.

## ఐటీడీఏ పీఓ రాహుల్‌కు పీవీఎంఎస్ ఆహ్వానం



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: పారంపర్య వైద్యుల మహా సంఘం (పివిఎంఎస్) తెలంగాణ రాష్ట్ర 3వ మహాసభలకు హాజరు కావాలంటూ ఐటీడీఏ పీవో బి.రాహుల్‌కు పారంపర్య వైద్యులు ఆహ్వాన పత్రికను అందించారు. గురువారం భద్రాచలంలోని ఆయన చాంబర్‌లో ఆహ్వాన పత్రికను అందించి, మహాసభల వివరాలను తెలియజేశారు. భద్రాచలంలో ఈనెల 8,9,10 తేదీలలో రామాలయ సమీపంలో గల 'శ్రీ మార్కండేయ పద్మశాలి భవన్'లో జరుగనున్న రాష్ట్ర మూడవ మహాసభలకు హాజరు కావలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఆయుర్వేద మూలాలను సామాన్యుల వరకు తీసుకువెళ్లేందుకు కృషి చేయడం అభినందనయమని ఈ సందర్భంగా పీఓ రాహుల్ అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రామంచి శ్రీనివాస్, జిల్లా కన్వీనర్ జి. సుగుణారావు, తూము రమేష్, దశరథ్ రజువా, కె. మహేందర్, తీగల రమేష్‌లు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీల అమలుకై బి ఆర్ ఎస్ పార్టీ మహాధర్నా



వలిగొండ ,ప్రజాస్ఫూర్తి: వలిగొండ మండల కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుకై గురువారం వలిగొండలో బి ఆర్ ఎస్ పార్టీ మండల ప్రధాన కూడలిలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలుకై కేటీఆర్ ఇచ్చిన పిలుపుమేరకు భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ల శేఖర్ రెడ్డి ఆదేశానుసారం వలిగొండలో బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు తుమ్మల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శేఖర్ రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలను ప్రజలకు గుర్తుచేస్తూ, 100 రోజులలో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజులు గడిచినా అమలు కాని హామీలపై ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను మోసపూరితమైన వాగ్దానాలు వైఫల్యాలు, ప్రజా సమస్యలు, అవినీతి ఆరోపణలను ప్రజల ముందుంచి ప్రభుత్వాన్ని నిలదీయాలని పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలకు పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కంచర్ల రామకృష్ణారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ సురకంటి వెంకటరెడ్డి కొమరెల్లి సంజీవరెడ్డి మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్, శ్రీ మత్స్యగిరిగుట్ట మాజీ చైర్మన్ ముద్దసాని కిరణ్ రెడ్డి పట్టణ అధ్యక్షులు అప్రోజు బాషా బి ఆర్ ఎస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రినిటీలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని ట్రినిటీ పాఠశాల కిడ్ జోన్ లో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిన్నారుల చేత శ్రీకృష్ణుని, గోపిక వేషధారణలు వేయించారు. పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ ఉజ్జిని మంజుల చిన్నికృష్ణులతో ఉట్లు కొట్టించారు. అదేవిధంగా గోపికలతో వివిధ సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ప్రిన్సిపాల్ మంజుల మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవిత చరిత్ర గురించి పిల్లలకు వివరంగా వివరించారు. శ్రీకృష్ణుడు చిన్నప్పుడు వెన్నతింటూ చిలిపి చేష్టలు చేశారని, చిన్న వయసులోనే లోక కళ్యాణం కోసం ఒక్క వేలు తో గోవర్ధనగిరి పర్వతం కురుక్షేత్ర యుద్ధంలో శ్రీకృష్ణుడు ధర్మం వైపు నిలబడి ధర్మాన్ని గెలిపించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్లు స్వరూప, భార్గవి, ఉపాధ్యాయులు మౌనిక, జ్యోతి, అరుణ, స్వరూప, భాగ్యలక్ష్మి, శ్వేత, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

## రేవంత్ రెడ్డి వెయ్యి రోజుల పాలనలో
# ప్రజలకు మెరుగైన పాలన అందించారు



ప్రజాస్ఫూర్తి, సూర్యాపేట: కెసిఆర్ కుటుంబ పాలన నుండి విముక్తి పొందిన తెలంగాణ రాష్ట్రం నేడు ప్రజాపాలనలో అన్ని రంగాలలో అభివృద్ధిని సాధించిందని తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఆయన నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వెయ్యి రోజుల పాలనలో అనేక సంక్షేమ పథకాలను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తూ దేశంలోనే అగ్రగా నిలిచిందని అన్నారు. వెయ్యి రోజుల పాలనపై తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు సంబరాలు జరుపుకుంటున్నారని ర్యాలీలు చేస్తున్నారని ఆయన అన్నారు. కానీ రేవంత్ రెడ్డి పాలనపై కేవలం బిఆర్ఎస్ నాయకులు మాత్రమే అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, పేదలకు సన్న బియ్యం పంపిణీ, మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తుందని తెలిపారు.గ్యాస్ సిలిండర్ కు 500 రూపాయలు సబ్సిడీని ప్రభుత్వం ఇస్తుందని ఆయన అన్నారు. బిఆర్ ఎస్ పాలనలో నిరుద్యోగ యువతను మోసం చేశారని, ఉద్యోగ నియామకాలు చేపట్టలేదని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం 72000 ల ఉద్యోగాల నియామకం చేపట్టడంతో పాటుగా 7,427 పోలిసు ఉద్యోగాల భర్తికి నోటిఫికేషన్ ఇచ్చామని చెప్పారు. సిఎం ఆర్ ఎఫ్ పదకం ద్వారా 2500 కోట్ల రూపాయల వ్యయంతో 5 లక్షల 18 వేల మంది రోగులకు మెరుగైన వైద్యం అందించామని అన్నారు ఈ సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ షఫి వుల్లా,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు వెలుగు వెంకన్న, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్, నాయకులు బైరబోయిన శ్రీనివాస్,పాలగాని కృష్ణ, తండు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## గరిడెపల్లి న్యూ జనరేషన్ స్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



గరిడేపల్లి,ప్రజాస్ఫూర్తి: గరిడెపల్లి స్థానిక న్యూ జనరేషన్ పాఠశాలలో శ్రీకృష్ణాష్టమి వేడుకలను గురువారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో అలరించారు. చిన్నారి కృష్ణుల లీలలు, ఉట్టి కొట్టే ఘట్టాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణుడి వేషధారణలో భార్గవ్, రితిక్ నందన్, లిఖిత్, సుదీక్ష, మన్విత్, బిశ్వజీత్ మురిపించారు. అలాగే గోపికల వేషధారణలో లక్ష్మీగాయత్రి, మేఘన, జాహ్నవి, తేజశ్రీ, నందన ఆకట్టుకున్నారు.ఈ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపల్ ఆవుల నరసింహారావు మాట్లాడుతూ, మన సనాతన సంస్కృతి, సంప్రదాయాలను, ఆధ్యాత్మిక విలువలను భావితరాలకు అందించడంలో ఇటువంటి పండుగల నిర్వహణ ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. శ్రీకృష్ణుడి జీవితం ద్వారా ప్రతి ఒక్కరూ ధర్మాన్ని పాటించడం, సమస్యలను ఎదుర్కొనే విధానాన్ని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. చిన్నతనం నుంచే పిల్లల్లో నైతిక విలువలను పెంపొందించేందుకు తమ పాఠశాల ఎల్లప్పుడూ ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.వేడుకల నిర్వహణలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీలత, సుధారాణి, హలీమా, స్వప్న, ఉపేంద్ర, స్వాతి, అనూష, లక్ష్మీ, మనీషా, దీప్తి, జాస్మిన్తో పాటు పాఠశాల సిబ్బంది నరేందర్, రాణి, నవనీత సహకారం అందించి కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## భూభారతి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

* జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



ప్రజా స్ఫూర్తి,భైంసా: జిల్లాలో పెండింగ్‌లో ఉన్న భూభారతి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.గురువారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో భూభారతి దరఖాస్తుల పరిష్కారంపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మండలాల వారీగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, వాటి పరిష్కార ప్రగతిని పరిశీలించారు. ప్రతి దరఖాస్తును క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం తగిన నిర్ణయం తీసుకోవాలని సూచించారు.దరఖాస్తుల పరిష్కారంలో ఎలాంటి నిర్లక్ష్యం, జాప్యానికి తావులేకుండా నిర్ణీత గడువులోగా పెండింగ్ కేసులన్నింటినీ క్లియర్ చేయాలని స్పష్టం చేశారు.ఏదైనా సాంకేతిక లేదా ఇతర కారణాలతో దరఖాస్తును తిరస్కరించాల్సి వస్తే, తిరస్కరణకు గల స్పష్టమైన కారణాలను రికార్డుల్లో తప్పనిసరిగా నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే 22ఏ నిషేధిత జాబితాలోని భూములకు సంబంధించిన సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి, నిబంధనల మేరకు తక్షణమే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారులకు పారదర్శకంగా, నిబంధనల ప్రకారం సేవలు అందించడంతో పాటు భూభారతి దరఖాస్తుల పరిష్కార ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, ఆర్డీవో దేవీదాస్, సంబంధిత శాఖల అధికారులు, తహసీల్దార్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గాయత్రి స్కూల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి: వలిగొండ పట్టణంలోని గాయత్రి హైస్కూల్ నందు కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ శ్రావణ మాసం కృష్ణ పక్షం అష్టమి రోహిణి నక్షత్ర యుక్త రోజున శ్రీకృష్ణుడు కంసుడి చెరసాలలో దేవకి, వసుదేవులకు జన్మించాడు.దీనిని గోకులాష్టమి, అని శ్రీకృష్ణుని బాల్య లీలలను స్మరిస్తూ ఉట్టి కొట్టే వేడుకను ఘనంగా నిర్వహిస్తారుఅని అన్నారు .ఈ కార్యక్రమంలో చైర్మన్ తావుటాము నరహరి, మురళీధర్ రెడ్డి, కొంతం బిక్షపతి, పాలకుర్ల వెంకటేశం గౌడ్, బిమిడి కవిత, తదితరులు పాల్గొన్నారు.

**డెల్టా హైస్కూల్లో**

మండల కేంద్రంలోని డెల్టా హైస్కూల్లో కూడా కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ పబ్బు శ్రీధర్ యాజమాన్యం వెంకటేశు పాండు తదితరులు పాల్గొన్నారు

## బీసీ మహిళలకు ఉచిత కుట్టు మిషన్లు

* సెప్టెంబర్ 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు



జనగామ, ప్రజాస్ఫూర్తి : బీసీ మహిళల కు స్వయం ఉపాధి కల్పించి ఆర్థికంగా స్వావలంబన సాధించేలా తెలంగాణ ప్రభుత్వం 100 శాతం సబ్సిడీ పై రూ. 12 వేల విలువైన ఆటోమేటిక్ కుట్టు మిషన్లు అందించనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి ఎన్.ఎల్. నరసింహా రావు తెలిపారు. 18 నుంచి 55 ఏళ్ల వ యస్సు గల బీసీ మహిళలు దరఖాస్తు చేసుకోవచ్చు. పేదలు,నిరాశ్రయులు, వి తంతువులు, ఒంటరి మహిళలు, అనా థలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొ న్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కుటుంబ వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షల్లోపు ఉండా లి. ఒక కుటుంబానికి ఒక్కరికే అవకా శం ఉంటుంది. అర్హులు టీజీఓబిఎంఎంఎస్ వెబ్‌పోర్టల్ ద్వారా సెప్టెంబర్ 15, 2026 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లని, అవసరమైన పత్రాలతో దరఖాస్తు ప్రతిని సంబంధిత ఎంపీడీఓ లేదా ము న్సిపల్ కార్యాలయంలో సమర్పించాల ని అధికారి సూచించారు.

## రైతులంతా క్రాప్ సర్వేలో పంటల వివరాలను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి

* జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా



ప్రజాస్ఫూర్తి, భైంసా : జిల్లాలోని రైతులందరూ తమ సాగు, పంటల వివరాలను క్రాప్ సర్వేలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా స్పష్టం చేశారు. గురువారం సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ గ్రామ శివారులో పొలాల్లో కొనసాగుతున్న క్రాప్ సర్వే ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో కలెక్టర్ మాట్లాడుతూ, పంటల వివరాలు క్రాప్ సర్వేలో సక్రమంగా నమోదైతే భవిష్యత్తులో ధాన్యం విక్రయాలు, ప్రభుత్వ పథకాల ద్వారా లభించే సహాయం, ఇతర వ్యవసాయ ప్రయోజనాలు పొందే సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ సిబ్బందికి అవసరమైన సహకారం అందించి, తమ పంటల వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవాలని సూచించారు.క్రాప్ సర్వేలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పంటల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. సర్వే సిబ్బంది తప్పనిసరిగా రైతుల సమక్షంలోనే పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాస్తవ సాగు వివరాలను నమోదు చేయాలని స్పష్టం చేశారు. నిర్దేశిత గడువులోగా క్రాప్ సర్వేను పూర్తి చేసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన స్థానిక యువతను వాలంటీర్లుగా నియమించుకుని వారి సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సర్వే ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, నమోదు ప్రక్రియలో పారదర్శకత, ఖచ్చితత్వం ఉండేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సుజాత, ఎంపీఓ అజీజ్ ఖాన్, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కుంభం మామఆరే ధర్మారెడ్డి కి ఘన నివాళులు



వలిగొండ, ప్రజాస్ఫూర్తి:భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మామగారైన ఆరే ధర్మారెడ్డి అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం ఉదయం మరణించిగా సూర్యాపేట జిల్లా కందగట్ల గ్రామంలో వారి అంత్యక్రియలు నిర్వహించారు.అంత్యక్రియలకు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామ్యూల్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి, శ్రీ రాంరెడ్డి సర్వోత్తం రెడ్డి తదితరులు హాజరై వారి పార్థివదేహానికి నివాళులర్పించారు.భువనగిరి నియోజకవర్గ పరిధిలోని ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆరే ధర్మారెడ్డి పార్థివదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఓటరు హక్కుకు భంగం కలగొద్దు.. ఎస్ఐఆర్ హియరింగ్ పకడ్బందీగా




జనగామ, ప్రజాస్ఫూర్తి : ఎస్ఐఆర్-20 26 లో భాగంగా నోటీసుల హియరింగ్, అభ్యంతరాల పరిష్కార ప్రక్రియను ఎ న్నికల నిబంధనల మేరకు పారదర్శకం గా, ఎలాంటి లోపాలకు తావులేకుండా నిర్వహించాలని జిల్లా ఎస్ఐఆర్ అబ్జ ర్వర్ విజయేందిర బోయి అధికారుల ను ఆదేశించారు.నో మాపింగ్, అనొమా లీస్ కేసులను ఆధారాలతో సమగ్రంగా పరిశీలించి, అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా జాబితా నుంచి తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మండలం లోని శామీర్‌పేట్ ,మున్సిపల్ కార్యాలయంలో కొనసాగుతున్న ఎస్ఐ ఆర్ హియరింగ్ కేంద్రాలను జిల్లా కలెక్ట ర్ సందీప్ కుమార్ ఝాతో కలిసి ఆమె పరిశీలించారు. పెండింగ్ కేసులను సకా లంలో పరిష్కరించి, రోజువారీ హియ రిం గ్‌ను అదే రోజు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## భాష్యం పాఠశాలలో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



వివేకానంద నగర్, ప్రజాస్ఫూర్తి : వివేకానంద నగర్‌లోని భాష్యం పాఠశాల VVN బ్రాంచ్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధాదేవి వేషధారణలో అలరించారు. చిన్నారుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు శ్రీకృష్ణుని జీవిత విశేషాలను, భగవద్గీత సందేశాలను తెలియజేస్తూ వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. సంప్రదాయ వేషధారణలో చిన్నారుల సందడితో పాఠశాల ఆవరణలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీమతి బండారు సుధా మాధవి మాట్లాడుతూ, శ్రీకృష్ణాష్టమి వంటి పండుగల ద్వారా విద్యార్థులకు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలపై అవగాహన పెరుగుతుందని తెలిపారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠశాల సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

## యాదవ సోదరులంతా తరలివచ్చి ఐక్యత చాటాలి

**: భూస రమేష్ యాదవ్.**



జనగామ, ప్రజాస్ఫూర్తి : జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న శ్రీకృష్ణ జన్మాష్టమి ఉత్సవాలను యాదవ సోదరులంతా పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు సిద్ధిరాజు యాదవ్ పిలుపునిచ్చారు. ఆయన ఆదేశాల మేర కు జిల్లా ప్రచార కార్యదర్శి భూస రమే ష్ యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకృష్ణ ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో నిర్వహించనున్న ఈ వేడుకల కు మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్,జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే అనిల్ యాదవ్‌తో పాటు యాదవ సంఘం పె ద్దలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజ రుకానున్నట్లు తెలిపారు. ఉదయం 11 గంటలకు నెహ్రూ పార్క్ యాదవ్ నగర్ నుంచి బతుకమ్మ కుంట వరకు ఉట్టి కొట్టే కార్యక్రమంతో పాటు వివిధ సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. యాదవ సోదరు లు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల ను ఘనంగా నిర్వహించడంతో పాటు యాదవుల ఐక్యతను చాటాలని కోరారు.

## త్రివేణి పాఠశాలలో ఘనంగా శ్రీ కృష్ణాష్టమి వేడుకలు



ప్రజాస్ఫూర్తి , కొత్తగూడెం :లక్ష్మీదేవి పల్లి లోని త్రివేణి పాఠశాల నందు శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు . ముందుగా శ్రీకృష్ణుని ప్రతిమకు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి జగదీష్ మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితము నుండి ధర్మం , సత్యం , సత్ప్రవర్తన , కర్తవ్య దీక్ష అలవర్చుకోవాలని ఆయన సూచించారు . అనంతరం చిన్నారులు శ్రీకృష్ణుడు , రాధాదేవి వేషధారణలు అందరిని ఆకట్టుకోవటంతో పాటు చిన్నారుల చేత రాధాకృష్ణ నృత్యాలు , ఉట్టి కొట్టుట ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సిఆర్ఓ కాట్రగడ్డ మురళీకృష్ణ , ప్రిన్సిపల్స్ సూర్య నారాయణమూర్తి , శ్రీనివాస్ సింగ్ ,నేతాజీ , వైస్ ప్రిన్సిపల్ సౌజన్య , పాఠశాల టీచింగ్ సిబ్బంది , చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సామాజికసేవామూర్తులు

## పెరిక గోపాల్, రాజరత్నం విగ్రహాల ఆవిష్కరణ

నల్లగొండ, ప్రజాస్ఫూర్తి: ప్రజా జీవితంలో విశేష సేవలందించిన మాజీ నల్లగొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ప్రకాశం బజార్ రూప కర్త కీ.శే. పెరిక గోపాల్, మాజీ ఎమ్మెల్యే కీ.శే. పెరిక రాజరత్నం వి గ్రహాలు రోడ్డు వెడల్పు లో భాగంగా అక్కడ నుండి తీసి విగ్రహాలను పునర్నిర్మించి గురువారం నల్లగొండ ప్రకాశం బజార్ కూరగాయల మార్కెట్ కూడలిలో ఆవిష్కరించారు. 16వ డివిజన్ కార్పొరేటర్ పెరిక స్వాతి వినాయకరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సేవామూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేయడం ద్వారా వారి సేవలను భావితరాలకు పరిచయం చేయడం అభినందనీయమన్నారు.

# మెదక్ టౌన్ పీఎస్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ

*** మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు**




ప్రజాస్ఫూర్తి, మెదక్ జిల్లా: మెదక్ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులు, కేసుల దర్యాప్తు పురోగతి, సాంకేతిక వ్యవస్థల అమలు తీరును పరిశీలించారు. టౌన్ ఇన్‌స్పెక్టర్ మహేష్ నుంచి స్టేషన్‌కు సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును పరిశీలించారు. కెమెరాల రికార్డింగ్, స్టేషన్ పరిసరాలపై నిఘా తదితర అంశాలపై ఇన్‌స్పెక్టర్ మహేష్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ ప్రాంగణంలో సీజ్ చేసిన వాహనాలను పరిశీలించి, వాటికి సంబంధించిన కేసుల వివరాలను ఆరా తీశారు. ఆన్‌సైట్ ఎఫ్ఐఆర్, జీరో ఎఫ్ఐఆర్ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును నిబంధనల మేరకు స్వీకరించి, బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాధారాలను ఈసాక్ష్యలో నిబంధనల ప్రకారం నమోదు చేసి భద్రపరచాలని సూచించారు. దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సీసీటీఎన్ఎస్‌లో కేసులకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని, రికార్డుల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా చూడాలని ఆదేశించారు. పెండింగ్ రిపోర్టులను త్వరితగతిన పూర్తి చేసి, దర్యాప్తు ప్రక్రియలో పారదర్శకత, క్రమశిక్షణ పాటించాలని స్పష్టం చేశారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి దర్యాప్తును వేగవంతం చేయాలని, కేసుల పరిష్కారానికి అవసరమైన చర్యలను ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రజలతో మర్యాదగా వ్యవహరించి, వారి సమస్యలను సానుకూలంగా పరిష్కరించేలా సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు మెరుగైన పోలీసింగ్ సేవలు అందిస్తూ పోలీస్ శాఖపై నమ్మకాన్ని మరింత పెంపొందించేలా పనిచేయాలని సూచించారు. వెంట సీఐలు సందీప్‌రెడ్డి, మహేష్, ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

# ఎన్టీఆర్ స్టేడియంలో వనమహోత్సవం



మహబూబాబాద్, ప్రజాస్ఫూర్తి : కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో వనమహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశమునకు అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ మహబూబాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియం కేంద్రంగా చేసుకొని ఏర్పాటు చేసిన కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించడం చాలా అభినందనీయమని,దాతల సహకారంతో సుమారుగా 100 మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు చూసుకోవడం వలన భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని అన్నారు.భూమిపై 33% ఉండాల్సిన అడవులు రోజురోజుకు తగ్గిపోవడం వలన ప్రకృతిలో అనేక విలయాలు సంభవిస్తున్నాయని,అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడడం వలన హిమానీనదాలు కరిగిపోవడం తద్వారా జలప్రళయాలు ఏర్పడుతున్నావని, దానికి ఉదాహరణ నేపాల్ దేశంలో జరిగిన వరదల వలన కలిగిన ఇబ్బందులను చూడవచ్చన్నారు. అందువలన భూమిపై అవకాశం ఉన్న ప్రతి చోట (ఇంటిలో, బయట) ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని బ్రతికించుకోవాలని అన్నారు. మున్సిపల్ కౌన్సిలర్ కాటా భాస్కర్ మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో ఎన్నినో వలన కరువులు ఏర్పడడానికి అడవులు లేకపోవడమే కారణమని అన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడానికి కృషి చేయాలని అన్నారు. వనమహోత్సవ కార్యక్రమానికి సుమారుగా 100 మొక్కలను అందించిన గుండంరాజు పల్లి సర్పంచ్ గునిగంటి కమలాకర్ మాట్లాడుతూ ఈ స్టేడియంలో వాకింగ్ చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఇక్కడ అన్ని వయసులవారు చాలా ఆనందంగా వాకింగ్ చేయవచ్చని అన్నారు. మహబూబాబాద్ ఎంపీడీవో రఘుపతి రెడ్డి మాట్లాడుతూ ఈ స్టేడియంలో మొక్కలు నాటాలని భావిస్తే,వాటిని అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సలహాదారులు మైసా శ్రీనివాస్,కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్,పెద్ది వెంకన్న,సునీత దేవి, శ్రీనివాస్ రెడ్డి,ఎమ్మెస్ రెడ్డి,మహేందర్ రెడ్డి, రవీందర్,మధుకర్, మల్లారెడ్డి,ప్రసాద్, రాంబాబు, వెంకటేశ్వర్లు,తొలేం వెంకటేశ్వర్లు,ఎస్ శ్రీనివాస్ రెడ్డి, విద్యాసాగర్,వెంకట్, రవి,సోమ రవి, జగదీష్,రమేష్, కృష్ణమూర్తి, దామోదర్,భరత్, కృష్ణమోహన్, రాధాకృష్ణ,పగడయ్య, దామోదర్ రెడ్డి, నరేష్ రెడ్డి,బూర్ల ప్రభాకర్,ఐలేష్, నాగరాజు,బందెల రాజు,శ్రీనివాస్,నేరెళ్ల రాజు,రవి కుమార్, మధు,డాక్టర్ సాయి కిరణ్,మహిళలు పిల్లలు,యువకులు తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాలకు అవమానం సహించం

*** సంతు రవిదాస్ చిత్రపటానికి నల్లరంగు పూయడం దుర్మార్గం**

*** బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాకీ నరసింహ**



ప్రజాస్ఫూర్తి,నల్గొండ: మహనీయుల విగ్రహాలను అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాకీ నరసింహ అన్నారు. గురువారం స్థానిక డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద బిజెపి ఎస్సీ మోర్చ రాష్ట్ర అధ్యక్షుడు కాంతి కిరణ్ ఆదేశానుసారం సంత్ రవిదాస్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాకీ నరసింహ మాట్లాడుతూ సంత్ రవిదాస్ మహారాజ్ వంటి మహనీయుల చిత్రపటాలకు నల్లరంగు పూయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని సంబదితులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ కార్యకర్తల తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మహనీయుల ఆశయాలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వారి విగ్రహాలను అవమానించడం ద్వారా సమాజంలో విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నాలు చేయడం సరికాదన్నారు.రాజకీయంగా ఎన్ని విభేదాలు ఉన్నప్పటికీ మహనీయుల పట్ల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి రాజకీయ పార్టీకి ఉందని, అయితే రాజకీయ విభేదాలను వ్యక్తిగత దాడులకు, అవమానకర చర్యలకు దారితీయడం మంచిది కాదని పేర్కొన్నారు. ఇటీవల బీజేపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను కూడా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మహనీయుల గౌరవాన్ని కాపాడుతూ, వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీజేపీ ఎస్సీ మోర్చా నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. అనంతరం స్థానిక ఎస్సై గారికి పిర్యాదు చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు చింత ముత్యాల రావు, గోలి ప్రభాకర్, కార్యాలయ కార్యదర్శి మంగళపల్లి కిషన్, మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ నెవర్సు నీరజ, మండల అధ్యక్షులు బొగరి అనిల్ కుమార్, వన్ టౌన్ ఇంచార్జీ పెరిక నరసింహ, ఎస్సీ మోర్చ జిల్లా ప్రధాన కార్యదర్శి చినేని జాని, ఎస్సీ మోర్చ సీనియర్ నాయకులు కొమ్ము రాందాస్, జిల్లా కార్యవర్గ సభ్యులు దాసరి వెంకన్న, పుల్లెంల శ్యామ్, చామకూరి మహేష్, జిల్లా కోశాధికారి అదిమల్ల దేవేందర్, కొత్తపల్లి ప్రమోద్, మహిళా నాయకురాలు గూగులోతు తార, కందుకూరి సుధాకర్, చింతపల్లి వెంకన్న, మర్రి ఏడుకొండలు, పోత లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యానికి బ్రేక్‌ఫాస్ట్: ఎమ్మెల్యే గండ్ర



భూపాలపల్లి, ప్రజా స్ఫూర్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. గురువారం శాయంపేట మండల కేంద్రంలోని బాలికల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో కలిసి అల్పాహారాన్ని పరిశీలించి, ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. పేద విద్యార్థులు ఆకలితో పాఠశాలకు రాకుండా బ్రేక్‌ఫాస్ట్ పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు నాణ్యమైన విద్య, మౌలిక సదుపాయాలు, డిజిటల్ విద్య వంటి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.శాయంపేట మండలంలోని 27 పాఠశాలలు, ఒక జూనియర్ కళాశాలలో మొత్తం 922 మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. వారి విద్యా పురోగతి, అవసరాలను తెలుసుకుని ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ఉపాధ్యాయులు మరింత కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, కాంగ్రెస్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఊకె శిరీష కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలి

*** సిఐసిఐటియుయకులు నరసింహారావు. అమర్ సింగ్ డిమాండ్.**



ప్రజాస్ఫూర్తి ,కొత్తగూడెం : హైదరాబాదులోని ప్రైవేటు ఆసుపత్రి నందు నర్సుగా పనిచేస్తున్న ములకలపల్లి మండల ప్రాంత నివాసి అయిన ఊకె శిరీష కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించాలని సీఐటీయూ రాష్ట్ర నాయకులు మంద నరసింహారావు, గిరిజన సంఘం నేత వాంకుడోత్ అమర్ సింగ్ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆటో యూనియన్ కమిటి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి వద్ద ఊకె శిరీష చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలకు రోజురోజుకు రక్షణ లేకుండా పోతుందని, పని ప్రాంతాల్లో పనిచేస్తున్న శ్రామిక మహిళలకు రక్షణ కల్పించే చట్టాలను అమలు చేయకాపోవడం ఫలితంగానే ఇటువంటి సంఘటనలకు కారణమవుతుందని,. ఊకె శిరీషను అతికిరాతకంగా అత్యాచారం, హత్య చేసిన సనముల్లా ఖాన్, సంఘటనకు సహకరించిన వారందరినీ ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. .ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, ఆటో యూనియన్ నాయకులు వీరస్వామి, గణేష్, శ్రీనివాస్ రావు, తారాచంద్ తదితరులు పాల్గొన్నారు.

## సర్ నోటీసులు అందుకొని... ఆధారాలు సమర్పించి

*** ధ్రువపత్రాలను పరిశీలిస్తున్న తహసిల్దార్**




ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం:చుంచుపల్లి మండలంలోని సర్ నోటీసులు అందుకున్న వారంతా హియరింగ్ కు పరుగులు తీస్తున్నారు. దీనిలో భాగంగా స్థానిక తహసిల్దార్ కార్యాలయం నందు కార్యాలయ చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఇబ్బందులు లేకుండా ఉండాలని ఉద్దేశంతో తాసిల్దార్ ప్రత్యేక చొరవ తీసుకొని కార్యాలయ ఆవరణంలో తహసిల్దార్ నాగరాజు హియరింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా తాసిల్దార్ మాట్లాడుతూ తహసిల్దార్ కార్యాలయ చుట్టుపక్కల ప్రాంతాల వారికి ఇబ్బంది లేకుండా దగ్గర్లో ఉండాలని ఉద్దేశంతో మండల కార్యాలయంలో ప్రత్యేకంగా హియరింగ్ నిర్వహిస్తున్నామని ఆయన అంటూ , నోటీసులు అందుకున్న వారు ధ్రువపత్రాలతో వస్తున్నారని , వారి సమస్యలను తాసిల్దార్ ఓపికగా నివృత్తి చేస్తూ కావలసిన దృపత్రాలను పరిశీలిస్తూ బిఎల్వోలు సమక్షంలో ప్రత్యేక యాప్ లో పొందుపరుస్తున్నారు . ఈ కార్యక్రమంలో జిపిఓ బాలాజీ తో పాటు , బిఎల్ఓ లు పాల్గొన్నారు .

## అధికారులను సన్మానించిన చైర్మన్ జుట్టు కొండ సత్యనారాయణ



గరిడేపల్లి ,ప్రజాస్ఫూర్తి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రాయని గూడెం సంఘ సందర్శనలో భాగంగా అగ్రికల్చర్ మార్కెటింగ్ అధికారి అయిన సంతోష్ కుమార్, మరియు జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ అధికారులు ఏజీఎం వెంకటేశ్వర్లు, హరిబాబు, మేనేజర్ సతీశ్, సూపర్ వైజర్ అశోక్ లను సంఘ చైర్మన్ శ్రీ జుట్టు కొండ సత్యనారాయణ సన్మానించినారు. ఇట్టి కార్యక్రమంలో సెక్రటరీ నీడిగోండ కనకయ్య ,సిబ్బంది లక్ష్మయ్య, అంజయ్య, హరీష్, శ్రీను పాల్గొన్నారు.వారు సంఘ అభివృద్ధి గురించి పలు సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది.

MOVIE TIME



## అదే డేట్.. నో డౌట్

ఎన్టీఆర్ డ్రాగన్ వాయిదా పడనున్నట్లు వస్తోన్న రూమర్లపై మేకర్స్ తాజాగా రియాక్ట్ అయ్యారు. గాయం నుంచి కోలుకుంటున్న ఎన్టీఆర్ సెప్టెంబర్ మూడో వారం నుంచి షూటింగ్‌లో తిరిగి అడుగు పెట్టబోతున్నట్లు ప్రకటించారు. సెప్టెంబర్ మూడో వారం నుంచి నాన్‌స్టాప్‌గా షూటింగ్ జరుపుతాం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలోగా షూటింగ్ మొత్తం కంప్లీట్ చేస్తాం. చెప్పిన డేట్‌కు జూన్ 11న డ్రాగన్ థియేటర్లలోకి రాబోతుంది" అని తెలిపారు. ఎన్టీ ఆర్ సరసన రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా నటిస్తోండగా అనిల్ కాపూర్, బిజు మీనన్ , గురు సోమసుందరం కీలక పాత్రల్లో నటి స్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యెర్నేని, వై రవి శంకర్ నిర్మిస్తున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు రవి బస్రూర్ మ్యూజిక్ అందిస్తున్నారు.

## ఓటీటీలోకి
# ది ఇండియా స్టోరీ

కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ మూవీ ది ఇండియా స్టోరీ ఓటీటీలోకి వచ్చేస్తోంది. ఈనెల 25 నుంచి జీ5లో ఈ మూవీ స్ట్రీమింగ్ కానున్నట్లు వార్తలొస్తున్నాయి. హిందీతో పాటు తెలుగులోనూ రిలీజ్ కాబోతుంది. ఇందులో పెస్టిసైడ్స్ అధిక వినియోగం వల్ల దేశంలో పెరుగుతోన్న క్యాన్సర్ మరణాలపై పోరాటం చేసే మహిళా లాయర్‌గా కాజల్ కనిపించింది. కోర్టు రూమ్ డ్రామా థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సినిమాకు చేతన్ డీకే దర్శకత్వం వహించాడు. శ్రేయస్ తల్పాడే కీలక పాత్రలో నటించాడు. జూలై నెలాఖరున థియేటర్లలో రిలీజైన ఈ మూవీకి విమర్శకుల ప్రశంసలు దక్కగా కమర్షియల్‌గా మాత్రం ఫెయిల్యూర్‌గా నిలిచింది. కాగా ప్రస్తుతం తెలుగులో బాలకృష్ణతో ఓ సినిమా చేస్తోంది. ఎన్‌బీకే 111 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమా డిసెంబర్ 25న థియేటర్లలోకి రాబోతుంది. ఈ మూవీకి గోపీచంద్ మలినేని దర్శకత్వం వహిస్తున్నారు.



సినిమా



## రష్మికే నంబర్ వన్

### దేశంలోనే అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్‌గా రికార్డ్

నేషనల్ క్రష్ రష్మిక మందన్న కెరీర్‌లో మరో అరుదైన రికార్డును నెలకొల్పింది. భారతీయ సినీ పరిశ్రమలో అత్యధిక క్రేజ్ ఉన్న హీరోయిన్ల లిస్ట్‌లో నంబర్ వన్ ప్లేస్‌లో నిలిచింది. ఈ లిస్ట్‌లో దీపికా పదుకోణ్, సాయిపల్లవితో పాటు పలువురు హీరోయిన్లు రష్మిక తర్వాతే ఉండటం గమనార్హం. మూడ్ ఆఫ్ ది నేషన్ పేరుతో ఇండియా టుడే మ్యాగజైన్ క్రేజ్, స్టార్‌డమ్ పరంగా దేశంలోనే అత్యంత ప్రజాదరణ ఉన్న హీరోయిన్లు ఎవరనేదానిపై ఓ సర్వేను నిర్వహించింది. ఈ లిస్ట్‌లో రష్మిక మందన్నకు టాప్ ప్లేస్ దక్కింది. దీపికా పదుకోణ్ రెండో స్థానంలో నిలిచింది. సాహో హీరోయిన్ శ్రద్ధాకపూర్ మూడో స్థానం. నాలుగో ప్లేస్‌ను నాచురల్ బ్యూటీ సాయిపల్లవి దక్కించుకుంది. ఐదో స్థానం అలియాభట్‌కు దక్కింది. టాప్ ఫైవ్‌లో దక్షిణాది నుంచి రష్మికతో పాటు సాయిపల్లవి మాత్రమే ఉన్నారు.

## మల్టీస్టారర్ మూవీలో స్టెప్పులు

చాలా కాలం తర్వాత విక్టరీ వెంకటేష్ మూవీలో మిల్కీ బ్యూటీ తమన్నా స్పెషల్ సాంగ్‌లో కనిపించబోతోంది. వెంకటేష్, కళ్యాణ్ రామ్ హీరోలుగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో జనవరి 12 విడుదల పేరుతో తెరకెక్కుతున్న మల్టీస్టారర్ మూవీలో స్టెప్పులేయనుంది. తనకు వరుసగా బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన అనిల్‌పై గౌరవంతో మరోసారి స్పెషల్ సాంగ్ చేయడానికి ఓకే చెప్పిందట. సెప్టెంబర్ నెలాఖరున వెంకటేష్, కళ్యాణ్ రామ్ తమన్నాలపై ఈ సాంగ్‌ను షూట్ చేయబోతున్నట్లు తెలిసింది. ఈ పాటలో అనిల్ గెస్ట్‌గా కనిపిస్తా దని టాక్. ఈ సినిమాలో కీర్తి సురేష్, కృతి శెట్టి హీరోయిన్లుగా నటిస్తున్నారు. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో తెరకెక్కుతున్న ఈ మూవీ వచ్చే సంక్రాంతికి థియేటర్లలో సందడి చేయనుంది.






## రెమ్యూనరేషన్ తగ్గించిందట

టాక్సిక్ డిజాస్టర్‌తో హీరో యశ్ కంటే హీరోయిన్లపైనే ఎక్కువ ఎఫెక్ట్ పడుతోంది. ఈ ఫెయిల్యూర్‌తో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ తన రెమ్యూనరేషన్‌ను సగానికి తగ్గించినట్లు వార్తలు వస్తున్నాయి. ఒక్కో సినిమాకు ఐదు కోట్ల వరకు పారితోషికం తీసుకుంటుండగా ఈ ఫెయిల్యూర్తో తగ్గించిందట. రజనీకాంత్ ధర్మన్‌లో మొదట రుక్మిణిని ఓ హీరోయిన్‌గా అనుకోగా టాక్సిక్ రిజల్ట్ కారణంగా ఆమెను కాదని రాశీఖన్నాను ఆ రోల్ కోసం తీసుకున్నారు. మరో రెండు మూడు సినిమాలు దాదాపు ఓకే అవుతాయనే టైమ్‌లో చేజారిపోయాయి. కథ, తన పాత్ర బాగుంటే కోటి ఇచ్చినా కూడా సినిమా చేయడానికి రెడీ అని చెబుతోన్నట్లు టాక్ వినిపిస్తోంది.

## లగ్జరీ కారు కొన్న రణ్‌వీర్

ధురంధర్, ధురంధర్ 2 సక్సెస్‌లతో ఫుల్ జోష్‌లో ఉన్న బాలీవుడ్ హీరో రణవీర్‌సింగ్ ఓ లగ్జరీ కారును కొనుగోలు చేశాడు. ఈ జోష్‌లో హమ్మర్ బ్రాండ్‌కు చెందిన ఈ కారు ధర దాదాపు నాలుగు కోట్ల డెబ్బై ఐదు లక్షలకు పైగా వెచ్చించి కొన్నాడట. ఈ లగ్జరీ కారుతో ముంబైలోని ఓ ప్రొడక్షన్ ఆఫీస్‌కు రణవీర్ వచ్చిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. బాలీవుడ్‌లో హమ్మర్ ఈవీ కారును కొనుగోలు చేసిన సెకండ్ సెలిబ్రిటీగా ధురంధర్ హీరో నిలిచాడు.



Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.